క్లుప్తంగా

రూ.10 వేల పింఛన్ అందజేత



రూ.10 వేల పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ సునీల్‌కుమార్

బేస్తవారిపేట: మండలంలోని కలసపాడు మండలం సిద్ధిమూర్తిపల్లెకు వెళ్లి పూజల వెంకట సుబ్బమ్మకు నూతనంగా మంజూరైన రూ.10 వేల పింఛన్‌ను వలంటీర్ కువ్వారపు సునీల్‌కుమార్ శుక్రవారం పంపిణీ చేశారు. బేస్తవారిపేటకు చెందిన వెంకట సుబ్బమ్మ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటోంది. ప్రభుత్వం కొత్తగా రూ.10 వేల పింఛన్ మంజూరు చేసింది. భర్త పూజల శ్రీనివాసులు చేనేత వృత్తి చేసుకుంటూ సిద్ధిమూర్తిపల్లెలో ఉంటుండటంతో అక్కడే ఉంటోంది.

నేడు జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం

దర్శి: పట్టణంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం సమావేశం హాలులో ఉదయం 10 గంటలకు పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖలకు చెందిన గ్రామ, మండల, జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ గ్రామాల్లో విద్యుత్, తాగునీరు, రోడ్లు, ఇళ్ల పట్టాలు ఇతర సమస్యలు ఉంటే తక్షణ పరిష్కారం కోసం హాజరై తమ సమస్యలు పరిష్కారం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి శివాలయంలో ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు దుర్గా సమేత భోగేశ్వరస్వామి ఆలయంలో మూడో వార్షికోత్సవంలో భాగంగా మూడు రోజులు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు అర్చకులు మేడవరం రాఘవేంద్ర శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం గణపతి పూజ, అభిషేకం, హోమం, ఆదివారం ఉదయం చండీయాగం, అభిషేకం, హోమం, సాయంత్రం శివస్వాములు మెట్ల పూజ, భజన కార్యక్రమం , సోమవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమం, సాయంత్రం చిన్నారులచే కోలాటం, స్వామి వారి కళ్యాణం, మధ్యాహ్నం అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ట్యాబ్‌లు నిరంతరం ఉపయోగించాలి

పుల్లలచెరువు: ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లను తప్పని సరిగా ఉపయోగిస్తూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఇందిరాప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో 8,9 తరగతులను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ టెక్నాలజీని ఉపయోగించుకుని విద్యార్థులు పాఠాలను నేర్చుకోవాలన్నారు. ట్యాబ్‌ల్లో మాదిరి ప్రశ్నపత్రాలు తయారు చేసుకోవడంతో పాటు రోజూ విద్యార్థులు ట్యాబ్‌లు ఉపయోగించుకోవాలన్నారు. తెలియని విషయాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఈమె వెంట ప్రిన్స్‌పాల్ లిల్లీప్రకాశ్‌వాణి ఉన్నారు.

స్పోర్ట్స్ కిట్ బహూకరణ

దొనకొండ: స్థానిక గౌతమి డిగ్రీ కళాశాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్‌ను వార్డు మెంబర్ బొందల రాజు శుక్రవారం పంపిణీ చేశారు. విద్యార్థులకు చాలా కాలం నుంచి పుస్తకాలు, క్రీడా వస్తువులు అందజేస్తున్నట్లు దాత తెలిపారు. షటిల్ బ్యాట్లు 6, చెస్ బోర్డు 1, రింగ్ బాల్స్ 2, షటిల్ కాక్‌లు 6 అందజేశారు. రాజును ప్రిన్సిపల్ గోపి, కళాశాల అడ్మిన్ పి.ఎఫ్రాయిమ్ (నాని), విద్యార్థులు అభినందించారు.

ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తా

దర్శి: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎస్‌ఐ శివన్నారాయణ అన్నారు. దర్శి ఎస్‌ఐగా ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ ఎన్నికల తరుణంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు పాటిస్తామన్నారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తనను కలువొచ్చని చెప్పారు.

పుల్లలచెరువుకు మహిళా ఎస్‌ఐ నియామకం

పుల్లలచెరువు: స్థానిక పోలీసుస్టేషన్‌కు మొట్టమొదటి సారిగా మహిళా ఎస్‌ఐని నియమించారు. ప్రస్తుత ఎస్‌ఐ వై.శ్రీహరికి సీఐగా ప్రమోషన్ రావడంతో బాపట్ల జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎస్‌ఐగా ఎండీ ఫిరోజ్ ఫాతిమాను నియమించారు. ఆమె త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు స్టేషన్ సిబ్బంది తెలిపారు.

దొనకొండ ఎస్‌ఐగా సంపత్‌కుమార్

దొనకొండ: మండల కేంద్రం దొనకొండ ఎస్‌ఐగా సంపత్‌కుమార్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఒంగోలు వీఆర్ నుంచి వచ్చారు. దొనకొండ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన సైదుబాబు పామూరు మండలానికి బదిలీపై వెళ్లారు. తాను మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎస్‌ఐ తెలిపారు.

వలంటీర్లు జగనన్న సైన్యం

- దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ శివప్రసాదరెడ్డి, వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

కురిచేడు: సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు ప్రతి పథకం చేరువయ్యేలా చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక గుంటక నాసరరెడ్డి కళ్యాణ మండపంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి వలంటీర్లతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత వలంటీర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వలంటీర్ల కష్టానికి తగ్గ ఫలితం లభిస్తుందని, త్వరలో శుభవార్త వింటారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వలంటీర్లందరికీ తమ బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రమాద బీమా కల్పిస్తానని డాక్టర్ శివప్రసాదరెడ్డి ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహనరెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తూ తనను ఎమ్మెల్యేను చేయాలని ఆయన కోరారు.

ప్రజలకు ఆత్మీయ బంధువులు వలంటీర్లు: బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజలకు అత్యంత ఆత్మీయ బంధువులు వలంటీర్లేనని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కొనియాడారు. వానొచ్చినా, వరదొచ్చినా, కరువొచ్చినా, కరోనా వచ్చినా జగనన్న సైన్యం ముందుంటుందన్నారు. ఎంత ఇచ్చినా ఇంకా ఏం ఇస్తావని అడిగే ఈ రోజుల్లో కేవలం గౌరవ వేతనం రూ.5 వేలకు సంతృప్తి పడి వలంటీర్లు అభిమానంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్లు తీసుకోవాలంటే ఎన్నో కష్టాలు పడాల్సి వచ్చేదన్నారు. ఈ ప్రభుత్వంలో కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులకు పథకాలు అందిస్తున్నామని వివరించారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహనరెడ్డిని, బూచేపల్లి శివప్రసాదరెడ్డిని గెలిపించాలని వెంకాయమ్మ కోరారు. ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కండె గంగయ్య, మేరువ సుబ్బారెడ్డి, మేరువ పిచ్చిరెడ్డి, సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, ఎంపీడీఓ సీతారామయ్య, వీరగంధం కోటయ్య, నుసుం ప్రతాపరెడ్డి, ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, కురిచేడు, ఎస్ఎస్‌పీ అగ్రహారం సొసైటీ ప్రెసిడెంట్లు పోతిరెడ్డి నాగిరెడ్డి, ఆరె శ్రీనివాసరావు, పడమరగంగవరం సర్పంచ్ కాసు భాస్కరరెడ్డి, సాదం నాసరయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ వైవీ సుబ్బయ్య, నిమ్మకాయల రాజయ్య, ఆసుపల్లి చెన్నారెడ్డి పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సునీతాబ్రహ్మారెడ్డి

ముండ్లమూరు: గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంలో మండల స్థాయి అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో పెండింగ్ ఉన్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జమ్మలమడకలో పాఠశాల పనులు వేగవంతం చేయాలని ఆ గ్రామ ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నందున ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడాలన్నారు. కొందరు అధికారులు సమావేశాలకు సక్రమంగా రావడం లేదని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు కోరారు. ప్రభుత్వ భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. అర్హులకు హౌసింగ్ బిల్లులు సకాలంలో అందించాలన్నారు. ముందుగా పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వేముల పద్మావతి జానకిరామయ్య, ఎంపీడీఓ శంకరరావు, వైద్యాధికారి వెంకటేశ్వరరెడ్డి, ఏఓ ఫరూక్, పశువైద్యాధికారి విజయలక్ష్మి, ఏఈ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ట్రిపుల్ డ్రైవింగ్ వద్దు



బైకు నడుపుతూ ర్యాలీలో పాల్గొన్న ఎంవీఐ రవికుమార్

దర్శి: మోటారు సైకిల్ వాహనదారులు ట్రిపుల్ డ్రైవింగ్ చెయ్యవద్దని ఎంవీఐ రవికుమార్ సూచించారు. జాతీయ భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఎంవీఐ కార్యాలయం నుంచి హెల్మెట్‌లు పెట్టుకుని మోటారు సైకిల్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంవీఐ రవికుమార్ మాట్లాడుతూ రహదారి భద్రత మనందరి బాధ్యతని చెప్పారు. మోటారు సైకిల్ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చెప్పారు.

ఆంగ్ల ప్రసంగంలో విద్యార్థుల ప్రతిభ



ప్రశంస పత్రాలతో విద్యార్థులు

పొదిలి: ఆంగ్ల ప్రసంగంలో స్థానిక నిర్మల కాన్వెంట్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అద్వైత్ స్కిల్ హబ్ ఆధ్వర్యంలో గుంటూరులో టోస్ట్ మాస్టర్ రాష్ట్ర స్థాయి కాంపిటీషన్ నిర్వహించారు. ఇందులో నిర్మల కాన్వెంట్ విద్యార్థులు జెన్నీఫర్, సుదీప్తి ఆంగ్ల ప్రసంగంలో ప్రావీణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి స్కిల్ హబ్ ఎండీ అజయ్‌కుమార్ తదితరుల చేతుల మీదుగా మెడల్స్, ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రూబీ, హెడ్మిస్ట్రెస్ రాణి, రీజినల్ మేనేజర్ దేవపాల్, సంతోషిలత తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు



ఈదరలో వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు



గొట్టిపడియలో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ చందన

తాళ్లూరు (ముండ్లమూరు): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాధవీలత అన్నారు. స్థానిక సచివాలయం–2లో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైద్యాధికారులకు ఆమె పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం 232 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 61 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. వారిలో శస్త్ర చికిత్స కోసం నలుగురిని రిఫర్ చేశారు. వైద్యాధికారులు శ్వేతారెడ్డి, ఖాదర్ మస్తాన్‌బీ, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండలంలోని ఈదరలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. 70 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 65 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, కంటి వైద్య నిపుణులు విజయేంద్ర, సిబ్బంది నరసింహారావు, రాజు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అర్ధవీడు (కంభం): మండలంలోని దొనకొండలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు పాల్గొని రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేశారు. ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి, సర్పంచ్ ఎస్తేరు రాణి, ఎంపీటీసీ చంద్రశ్రీప్రియ, సుబ్బారెడ్డి, డాక్టర్ మోనా రసూల్, డాక్టర్ పద్మావతిబాయి, డాక్టర్ విజయచంద్ర, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: మండలంలోని గొట్టిపడియ గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ తోట చందన సూచించారు. కౌంటర్లను పరిశీలించి, పలువురికి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య శ్రీ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీపై ఏఎన్ఎం, వలంటీర్లకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసం సాగుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త లీలాకృష్ణ

తాళ్లూరు (ముండ్లమూరు): పశుపోషకులు మేలు రకం పశుగ్రాసాల సాగు చేస్తే ఖర్చు తగ్గించుకోవచ్చని దర్శి కేవీకే పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. లీలాకృష్ణ తెలిపారు. మండలంలోని దారంవారిపాలెంలో శుక్రవారం పాడి రైతులకు పశుగ్రాసం సాగుపై అవగాహన కల్పించారు. ధాన్యపు జాతి, గడ్డి జాతి, పప్పుజాతి పంటలు ముఖ్యమైనవని తెలిపారు. ఆయా రకాలను ఎంపిక చేసుకొని సాగు చేసుకోవాలన్నారు. డీబీఆర్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏరియా కో ఆర్డినేటర్ జి.వెంకటరావు, సర్పంచ్ మంచాల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అందరం ఒకే వర్గం



విలేకరులతో మాట్లాడుతున్న రమణారెడ్డి

దొనకొండ: నియోజకవర్గంలోని 5 మండలాల వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు ఒకే వర్గమని..అదే జగనన్న వర్గం, బూచేపల్లి కుటుంబానికి సన్నిహితులని వైఎస్సార్ సీపీ నాయకుడు, దర్శి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి మామ కాపా రమణారెడ్డి అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి సమక్షంలో శుక్రవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమణారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పని చేసి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిని గెలిపించుకుని జగన్ మోహన్‌రెడ్డికి గిఫ్ట్‌గా ఇవ్వాలన్నారు. గురువారం నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం దొనకొండలో విజయవంతం చేసినందుకు నాయకులు, కార్యకర్తలకు, డ్వాక్రా మహిళలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2019 ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీకి వచ్చిన మెజార్టీ కన్నా ఎక్కువ తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ బండారు రాజు, పిల్లి ఓబులరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గుంటు పోలయ్య మాట్లాడిన వారిలో ఉన్నారు. కర్నాటి ప్రసన్నాంజనేయరెడ్డి, వజ్రగిరి సాలోమన్, తమ్మనేని సుబ్బారెడ్డి, దగ్గుల వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు, ఎగ్గోని కృష్ణారెడ్డి, దేశిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

5 నుంచి చందవరంలో ఎన్నికల ప్రచారం

దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి దొనకొండ మండలంలోని చందవరం గ్రామ పంచాయతీ నుంచి 5వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి ఎన్నికల ప్రచారం చేస్తారని రమణారెడ్డి తెలిపారు. చందవరం గ్రామస్తులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు సహకరించాలని రమణారెడ్డి కోరారు.

బోధనలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈఓలు నాయక్, శ్రీనివాసులు

మార్కాపురం: సాంకేతిక విజ్ఞానాన్ని ఉపాధ్యాయులు అందిపుచ్చుకుని పాఠాలు బోధించాలని ఎంఈఓ తుబేటి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మార్కాపురం, పెద్దారవీడు, దోర్నాల, తర్లుపాడు మండలాల గణిత ఉపాధ్యాయులకు ఐసీటీ సిమ్యులేషన్స్ ట్రెనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. రాబోయేదంతా సాంకేతిక యుగమేనని వాటిని అందిపుచ్చుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు వీటిపై అవగాహన పెంచుకుని విద్యార్థులకు వివరించాలని ఎంఈఓ–1 రాందాస్‌నాయక్ వివరించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని హెచ్ఎం శ్రీదేవి కోరారు. రిసోర్స్ పర్సన్లు కాలంరాజు వేణుగోపాల్, ప్రసన్న, సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, మారుతీ కిరణ్‌కుమార్, జ్యోతి, 76 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పీఆర్ కాలనీ సంజీవని వృద్ధాశ్రమానికి వనిత కిట్టీ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా వనిత కిట్టీ పార్టీ నిర్వాహకులు సూరే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో నిర్వాసితులకు చేయూతనివ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. సభ్యులు శ్రీదేవి, సుజాత, కోటిరత్నం, కల్యాణి, వసంత పాల్గొన్నారు.

నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలో ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెడుతున్నానని స్థానిక కమిషనర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి సమస్యతో పాటు శానిటేషన్ వంటి ఇతర సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ప్రజల సమస్యలపై సత్వరమే స్పందించే విధంగా యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచుతామన్నారు. నగర పంచాయతీ అభివృద్ధికి అందరి సహాయ సహకారాలు ఉండాలని ఆయన కోరారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

గిద్దలూరు రూరల్: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య అన్నారు. పట్టణంలోని శ్రీపాతాళ నాగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో మహిళల సంక్షేమం కోసం అనేక రకాల పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. మహిళా సాధికారత కోసం అహర్నిశలూ శ్రమించే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని అన్నారు. కమిషనర్ వి.శ్రీనివాసరావు, మెప్మా సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, పక్కన చైర్మన్ కృష్ణ

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని కొండేపల్లి రోడ్డులో గోశాల నిర్మాణానికి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి గోశాల నిర్మాణం చేపట్టి గోవులను సంరక్షించాలని కమిటీ సభ్యులకు సూచించారు. మార్కాపురం పట్టణ ప్రాంతంలో సంచరిస్తున్న గోవులను గోశాలకు తరలించాలని చెప్పారు. కార్యక్రమంలో గోశాల సేవా కమిటీ అధ్యక్షుడు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు పీఎల్పీ యాదవ్, గుంటక వెంకటరెడ్డి, ఎస్‌ఎమ్ఎస్ఈ కార్పొరేషన్ డైరెక్టర్ మేడా బద్రీనాథ్, చెన్నకేశవస్వామి ఆలయ మాజీ చైర్మన్ పి.కేశవరావు, ఆలయ అర్చకుడు శ్రీపతి అప్పనాచార్యులు, కమిటీ ప్రతినిధులు గోపాలుని హరిహరరావు, జి.వనజాక్షి, జిల్లా వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బాలసుబ్బారావు, రంగస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ పనుల పరిశీలన

- ఎమ్మెల్యే కేపీ, కలెక్టర్‌ను కలిసిన ప్రిన్సిపాల్



ఎమ్మెల్యే కేపీతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజమన్నార్

మార్కాపురం: మార్కాపురం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజమన్నార్ శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని ఆయన నివాసంలో, ఒంగోలులో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాయవరం వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ పనులను పరిశీలించారు. కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో మాట్లాడి త్వరితగతిన భవనాల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట డాక్టర్లు పి.రవి కుమార్, ఆర్.లక్ష్మీపతిరావు ఉన్నారు.

జగనన్న కోసం మేము సైతం..



జెండా ఊపుతున్న ఉడుముల

కొనకనమిట్ల: జగనన్న కోసం మేము సైతం అంటూ శుక్రవారం ఒంగోలులో నిర్వహించిన జగనన్న కోసం విద్యార్థులు సిద్ధం కార్యక్రమానికి మండలం నుంచి పలు వాహనాల్లో వెళ్లారు. జిల్లా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జనరల్ సెక్రటరీ ఏలూరి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కొనకనమిట్ల, పొదిలి మండలాల నుంచి భారీగా విద్యార్థులు తరలివెళ్లారు. వాహనాలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి జెండా ఊపి పంపించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, సీసీకెఆర్ శ్రీను, నాగిరెడ్డి, విద్యార్థి విభాగ నాయకులు రవీంద్రబాబు, సేవాదళ్ అధ్యక్షులు వర్షం ఫిరోజ్ తదితరులు ఉన్నారు.

వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న కరస్పాండెంట్ అన్నా కృష్ణ చైతన్య, పక్కన గంపా నాగేశ్వరరావు

మార్కాపురం: విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య సూచించారు. శుక్రవారం కిట్స్ కళాశాలలో విద్యార్థులకు ప్రముఖ వ్యక్తిత్వ వికాసనిపుణుడు గంపా నాగేశ్వరరావు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, సాంకేతికతలో మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని కృష్ణ చైతన్య చెప్పారు. పరీక్షల్లో విజయం, జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవడం, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై గంపా నాగేశ్వరరావు సూచనలు సలహాలు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏట ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అనీల్‌కుమార్, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

వైద్యశాలకు వెళ్లి పింఛను అందజేత



పింఛను అందిస్తున్న వలంటీర్ శ్రీనివాసులు

మార్కాపురం: ఎద్దుపొడిచి తీవ్ర గాయాలతో జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి వలంటీర్ శ్రీనివాసులు శుక్రవారం పింఛను అందజేశారు. మార్కాపురం పట్టణంలోని వడ్డేపేట సచివాలయ పరిధిలో నిసించే పొదిలి నాగమ్మను 3 రోజుల క్రితం ఎద్దు పొడవటంతో తీవ్రంగా గాయాలయ్యాయి. ఆమెను చికిత్స కోసం జిల్లా వైద్యశాలలో చేర్పించారు. వలంటీర్ చెన్నూరి శ్రీనివాసులు శుక్రవారం జిల్లా వైద్యశాలకు వెళ్లి ఆమెకు పింఛను అందజేయడంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

స్వామి వివేకానందకు నివాళి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రామక్రిష్ణ ధ్యాన మందిరం ఆవరణలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ భక్త బృందం కార్యదర్శి పి.హనుమంతారెడ్డి స్వామి వివేకానంద జీవిత విశేషాల గురించి వివరించారు. సుప్రభాతసేవ, పూజా కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు, స్వామి వివేకానంద జీవిత విశేషాలపై ఉపన్యాసాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని వెల్లుపల్లె శ్రీరామక్రిష్ణ ధ్యాన మందిరంలో నిర్వాహకులు కాశిరెడ్డి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు.

పట్టణ ఎస్సైగా రెహమాన్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ ఎస్సైగా అబ్దుల్ రెహమాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కోటేశ్వరరావును బాపట్ల జిల్లాకు బదిలీ చేశారు. రెహమాన్ గతంలో దోర్నాల ఎస్సైగా పనిచేశారు. సీఐ ఆవుల వెంకటేశ్వర్లును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

పొదిలి సీఐగా మల్లికార్జునరావు

పొదిలి: పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా డి.మల్లికార్జునరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఒంగోలు దిశ విభాగంలో సీఐగా ఉన్న మల్లికార్జునరావును పొదిలిలో నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న రాఘవేంద్రరావు ఒంగోలు ఎస్‌బీకి బదిలీ చేశారు.

క్రికెట్ పోటీల్లో సత్తాచాటిన బొద్దికూరపాడు జట్టు



ప్రథమ స్థానం సాధించిన బొద్దికూరపాడు క్రీడాకారులు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని బొద్దికూరపాడు క్రికెట్ జట్టు ఆడుదాం.. ఆంధ్రా జిల్లా స్థాయి ఆటల పోటీల్లో ప్రథమ స్థానం సాధించి తమ సత్తా చాటారు. శుక్రవారం ఒంగోలులో జరిగిన ఫైనల్ క్రికెట్ పోటీల్లో సంతనూతలపాడు క్రికెట్ జట్టుతో తలపడి ప్రథమ సాధించారు. రాష్ట్ర స్థాయిలో క్రికెట్ పోటీలకు అర్హత సాధించారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రత్యేక బహుమతి

- కైవసం చేసుకున్న బేస్తవారిపేట జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థి



విద్యార్థికి అభినందనలు తెలుపుతున్న ఎస్ఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థి గంగుల శివకాసిక్ సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రత్యేక బహుమతి సాధించాడు. విజయవాడలో విశ్వేశ్వరయ్య సైన్స్ మ్యూజియం, ఇండియన్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. పలు రాష్ట్రాలకు చెందిన 210 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులు ప్రదర్శించారు. శివకాసిక్ అతి తక్కువ ఖర్చుతో తయారుచేసిన డ్రైవర్స్ యాంటి స్లీప్ అలారం ప్రాజెక్టు ప్రత్యేక బహుమతికి ఎంపికైంది. సైన్స్ ఉపాధ్యాయురాలు ఎస్‌వీ భారతి, హెచ్ఎం ఎంఎస్ శర్మ ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరించారు. భారత్ ఎలక్ట్రానిక్ కంపెనీ నుంచి ప్రత్యేక బహుమతిని విద్యార్థి అందుకున్నారు. సమగ్రశిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఎస్ఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, ఆర్జేడీ నాగమణి, మ్యూజియం క్యూరేటర్ ఉషా మెహరా చేతులమీదుగా బహుమతి, ప్రసంసపత్రాన్ని అందుకున్నారు.